క్లుప్తంగా

'నాటు కోళ్ల' యూనిట్ ప్రారంభం



డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): మండలంలోని ధర్మారం(బి) గ్రామంలో ఏర్పాటు చేసిన నాటు కోళ్ల మదర్ యూనిట్‌ను శనివారం డీఆర్‌డీవో సాయాగౌడ్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా పెరటి కోళ్ల (నాటు కోళ్లు) పెంపకం యూనిట్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. సత్యసాయి మహిళా సంఘం సభ్యురాలు ఉష ఈ యూనిట్‌ను ప్రారంభించడం అభినందనీయమన్నారు. మిగిలిన మహిళా సంఘాల సభ్యులు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఏపీడీ రవీందర్, ఏపీఎం రజితరెడ్డి, సీసీ నాగరాజు, వీవో పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

డిచ్‌పల్లి: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య డిమాండ్ చేశారు. బోనస్ ఎగవేత కోసమే ప్రభుత్వం సకాలంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం లేదని ఆయన ఆరోపించారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నెల రోజుల క్రితమే వరి కోతలు ప్రారంభం అయి ధాన్యాన్ని కల్లాల్లో ఆరబోసుకున్న రైతులు కొనుగోలు కేంద్రాల ప్రారంభం కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. అరకొర ప్రారంభించిన కొనుగోలు కేంద్రాలలో ధాన్యం కొనడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. ప్రభుత్వం వెంటనే కొనుగోళ్లు చేపట్టాలని లేదంటే జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. నాయకులు దేవస్వామి,గంగాధర్, బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి



ఇందల్వాయి: వరి కోతలు ప్రారంభమై నెల రోజులు కావస్తున్నా ప్రభుత్వం ఇంకా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడం లేదని మండల బీజేపీ నాయకులు విమర్శించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా వెంటనే ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ వెంకట్‌రావుకి శనివారం వినతిపత్రం అందించారు. మండల అధ్యక్షుడు నాయిడి రాజన్న, ఉపాధ్యక్షుడు చిన్ను, కుంట మోహన్‌రెడ్డి, రాజలింగం, మఠంల శేఖర్, సత్యనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

చెరువులో చేపపిల్లల విడుదల



ధర్పల్లి: మండల కేంద్రంలోని ఊర చెరువులో శనివారం స్థానిక అధికారులు, కాంగ్రెస్ నాయకులు చేప పిల్లలను విడుదల చేశారు. మండలంలోని 35 చెరువులకు ప్రభుత్వం వంద శాతం రాయితీపై ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేసిందని అధికారులు పేర్కొన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంపీడీవో బాలకృష్ణ , కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆర్మూర్ బాలరాజ్ , చెలిమెల నర్సయ్య చిన్నారెడ్డి సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు



జక్రాన్‌పల్లి: మండలంలోని పుప్పాలపల్లి గ్రామంలో శనివారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను పశువైద్య సిబ్బంది వేశారు. మండల పశువైద్యాధికారిణి శశిరేఖ, గోపాలమిత్ర రాజ్ కుమార్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వలకు చిక్కిన భారీ కొండచిలువ



ఇందల్వాయి: మండలంలోని లోలం గ్రామంలో చెరువులో చేపలు పడుతుండగా బెస్త చిన్న సాయిలు అనే జాలరికి శనివారం భారీ కొండచిలువ చిక్కింది. బయటకు లాగే సరికి అది చనిపోయి ఉందని, దాని పొడవు సుమారు 10 అడుగులు ఉంటుందని ఆయన తెలిపాడు. భారీ కొండచిలువను చూసేందుకు గ్రామస్తులు ఆసక్తి చూపారు.

డ్రైనేజీల నిర్వహణపై పట్టింపేది?





మహాలక్ష్మీనగర్‌లో మురికికాలువ కనిపించకుండా పెరిగిన పిచ్చిమొక్కలు.. జనప్రియనగర్ కాలనీలో..

- నగర శివారు కాలనీల్లో అధ్వానంగా మురికికాలువలు
- పరిసరాల్లో పేరుకుపోతున్న చెత్తాచెదారం
- పట్టించుకోని అధికారులు

నిజామాబాద్ రూరల్: నగర శివారు కాలనీలు డ్రైనేజీల దుర్గంధంతో కొట్టుమిట్టాడుతున్నాయి. ఆయా కాలనీల్లో మురికికాలువల నిర్వహణపై మున్సిపల్ సిబ్బంది పట్టించుకోకపోవడంతో అధ్వానంగా మారాయి. ఇరువైపులా పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిపోవడంతో మురుగు కాలువలు కనిపించకుండపోతున్నాయి. పలు చోట్ల మొక్కలు అడ్డురావడంతో డ్రైనేజీల్లో మురుగునీటి పారకం నిలిచిపోతుంది. దీంతో పరిసరాల్లో దుర్గంధం వెదజల్లడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఇదీ పరిస్థితి..

నగర శివారులోని విఠలేశ్వర్ నగర్, ముస్లింబస్తీ, నాలానగర్, లెనిన్ నగర్, తారకరామనగర్, మహాలక్ష్మీనగర్, బ్యాంక్‌కాలనీ, జనప్రియనగర్ కాలనీల్లో డ్రైనేజీలు అధ్వానంగా ఉన్నాయి. కాలనీల్లోని డ్రైనేజీలను శుభ్రం చేయడంలో పారిశుధ్య కార్మికులు నిర్లక్ష్యం వహించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పరిసరాలు అపరిశుభ్రంగా మారడంతో తాము రోగాలబారిన పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయినా అటు పాలకులు, ఇటు అధికారులు ఇటువైపు వచ్చిన పాపాన పోలేదని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి కాలనీల్లోని డ్రైనేజీలను శుభ్రపరిచేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



బ్యాంక్‌కాలనీలో రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్తాచెదారం

పారిశుధ్యంపై దృష్టిసారించాలి..

నగర శివారులోని కొన్ని కాలనీల్లో డ్రైనేజీలు అధ్వానంగా ఉన్నాయి. అయితే గత పాలకులు సరైన నిధులు కేటాయించకపోవడంతో పనులు చేయలేదు. పలు ప్రాంతాల్లో మురికినీరు రోడ్లపైనే ప్రవహిస్తుంది. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి కాలనీల్లో పారిశుధ్యంపై దృష్టి సారించాలి.

–కొర్వ గంగాధర్, మాజీ సర్పంచ్, కాలూర్

విషజ్వరాలతో బాధపడుతున్నాం..

భాగ్యనగర్ కాలనీలో డ్రైనేజీలు లేక మురికినీరు రోడ్లమీదకు వస్తుంది. పలు చోట్ల నీరు నిలిచిఉండటంతో దోమలు విజృంభిస్తున్నాయి. దీంతో చిన్నపిల్లలు జ్వరాల బారిన పడుతున్నారు. ఇప్పటికైన కాలనీలో డ్రైనేజీలను శుభ్రం చేయాలి.

–సోనిపటేల్, భాగ్యనగర్ కాలనీ

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

డిచ్‌పల్లి: ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని మండల ఆరోగ్య విస్తరణ అధికారి శంకర్ సూచించారు. మండలంలోని ధర్మారం(బి) మైనార్టీ గురుకుల బాలుర పాఠశాల/కళాశాలలో శనివారం ఇందల్వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. పలు సూచనలు, సలహాలు చేశారు. అనంతరం దోమల నివారణ చర్యలు చేపట్టారు. దోమల ద్వారా వచ్చే వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ రణవీర్ రెడ్డి, ఆరోగ్య పర్యవేక్షకులు రాజేందర్, దేవపాల, ఆరోగ్య కార్యకర్తలు సావిత్రి, మహాలక్ష్మి, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

నగరంలో ఈషా గ్రామోత్సవ్

- నవంబర్ 16, 17 తేదీల్లో క్రీడా పోటీలు

నిజామాబాద్‌నాగారం: సద్గురు ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొదటి సారిగా నిజామాబాద్‌లో అతి పెద్ద గ్రామ క్రీడోత్సవ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా నిజామాబాద్ కలెక్టర్ గ్రౌండ్‌లో నవంబర్ 16, 17 తేదీల్లో ప్రతి గ్రామ పంచాయతీ నుంచి పురుషుల వాలీబాల్, మహిళల త్రోబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నవంబర్ మొదటి వారం లోపల క్రీడాకారులు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వాలీబాల్ పోటీలకు 14ఏళ్లు పైబడిన వాళ్లు, త్రోబాల్ పోటీలకు 13ఏళ్లు పైబడిన వారు అర్హులన్నారు. నిజామాబాద్ స్థాయిలో గెలిచిన మొదటి నాలుగు టీమ్ లకు బహుమతులు అందజేస్తామన్నారు. మొదటి రెండు టీంలు హైదరాబాద్‌లో జరగబోయే స్టేట్ లెవెల్ క్రీడోత్సవాలలో పాల్గొంటాయన్నారు. రాష్ట్రస్థాయిలో గెలిచినవారు ఇషా ఫౌండేషన్లో జరిగే ఫైనల్స్‌కు అర్హత సాధిస్తారన్నారు. ఫైనల్లో గెలిచిన వారికి రూ. 5లక్షలు అందజేస్తామన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈషా వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. మరిన్ని వివరాలకు 96038 84290, 89859 02205ను సంప్రదించాలని వారు పేర్కొన్నారు.

సంక్షిప్తం

విద్యార్థులకు వైద్య పరీక్షలు



డిచ్‌పల్లి: మండలంలోని సుద్దపల్లి గురుకుల పాఠశాల/కళాశాలలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వైద్యులు స్వప్న, వెంకట్‌రెడ్డి, మలేహ సుల్తానా, ప్రిన్సిపాల్ నళిని, వైస్ ప్రిన్సిపాల్ స్వప్న, వనిత, ఆరోగ్య కార్యకర్తలు గంగుబాయి పాల్గొన్నారు.

ప్రతిభ పాఠశాలలో గ్రీన్‌డే

సిరికొండ: మండల కేంద్రంలోని ప్రతిభ హైస్కూల్‌లో శనివారం గ్రీన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. పచ్చదనం ఆవశ్యకతను తెలిపేలా విద్యార్థులు ఆకుపచ్చటి రంగుతో కూడిన వివిధ ఆకృతుల వేషధారణలతో ఆకట్టుకున్నారు. పాఠశాల కరస్పాండెంట్ సుంకం హరీష్, డైరెక్టర్ స్వాతిగణేష్, హెచ్‌ఎం పుల్లూరు అశోక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

జక్రాన్‌పల్లి: మండలంలోని పడకల్ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 28నుంచి రామగుండంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థులు శ్వేత, కైలాస్ పాల్గొంటారని తెలిపారు. వీరిని హెచ్‌ఎం సురేందర్ రెడ్డి, ఉపాధ్యాయులు, వీడీసీ ప్రతినిధులు అభినందించారు.

బాలల హక్కులపై అవగాహన

ఇందల్వాయి: మండలంలోని మేఘ్యా నాయక్ తండాలో శనివారం మహిళ శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలల హక్కులు, మహిళల రక్షణపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా అధికారులు పలు అంశాలపై తండావాసులకు అవగాహన కల్పించారు. అధికారులు నాగెల్లి బాబు, జ్యోత్స్నదేవి, బీక్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

నిజామాబాద్‌నాగారం: నగరంలోని విజయ్ హైస్కూల్ విద్యార్థి జునేరా హుస్సేన్ అండర్–17 జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైంది. ఈసందరంగా విద్యార్థిని శనివారం స్కూల్ వ్యవస్థాపకులు అమృతలత అభినందించారు.

వ్యవసాయశాఖ కమిషన్ సభ్యుడికి సన్మానం

తెయూ(డిచ్‌పల్లి): రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషన్ సభ్యులుగా నియామకమైన 'కేవీఎన్ రెడ్డి' ని శనివారం తెయూ ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు కొమిర శ్రీశైలం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఉషూ క్రీడాకారుడికి ఘనస్వాగతం

నిజామాబాద్ నాగారం: జార్జియా దేశంలో ఇటీవల నిర్వహించిన అంతర్జాతీయ ఉషు (అండర్–12) పోటీల్లో సత్తా చాటి జిల్లాకు విచ్చేసిన క్రీడాకారుడు సాయి దీక్షిత్‌కు క్రీడాభిమానులు శనివారం ఘనస్వాగతం పలికారు. నగర సీఐ శ్రీనివాస రాజు, సాయి దీక్షిత్‌ను అభినందించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

పోగొట్టుకున్న 20ఫోన్ల అందజేత

ఖలీల్‌వాడి: నగరంలోని 1వ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గతంలో పలువురు ఫోన్లు పోగొట్టుకోగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు శనివారం 20 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేశారు. ఎస్‌హెచ్‌వో రఘుపతి, సిబ్బంది ఉన్నారు.

అలరించిన ఫ్రెషర్స్‌పార్టీ



నిజామాబాద్‌అర్బన్: నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం కాకతీయ మహిళా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు నిర్వహించిన ఫ్రెషర్స్ పార్టీ ఎంతో అలరించింది. ఈసందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక ర్యాక్రమాలు, నృత్యాలు చేశారు. కళాశాల చైర్మన్ విజయలక్ష్మి, డైరెక్టర్ రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కులాస్‌పూర్‌లో వైద్యశిబిరం

మోపాల్: మండలంలోని కులాస్‌పూర్ గ్రామంలో ఆదివారం సిగ్మా ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామస్తులు ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆస్పత్రి యాజమాన్యం కోరింది.

సిర్‌పూర్ ప్రైమరీ స్కూల్‌లో నో బ్యాగ్ డే

మోపాల్: మండలంలోని సిర్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో శనివారం నో బ్యాగ్ డే నిర్వహించారు. అనంతరం ఇన్నోవేషన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో కాగితపు సంచుల తయారీ నేర్పించారు. ప్లాస్టిక్ సంచుల వల్ల కలిగే అనర్థాలను హెచ్‌ఎం నాగమణి వివరించారు. క్షేత్ర పర్యటనలో భాగంగా విద్యార్థులను గ్రామంలోని కోటకు తీసుకెళ్లారు. ఉపాధ్యాయులు రాము, అనురాధ, విద్యార్థులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



సిరికొండ: మండలంలోని పోత్నూర్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్‌నాయక్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ధాన్యాన్ని దళారులకు అమ్ముకొని మోసపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని రైతులకు తెలిపారు. నిజామాబాద్ ఏఎంసీ డైరెక్టర్ మంగిత్య, లింభన్న, మహిపాల్, రాకేష్, నవీన్, రాజు, సాయన్న, బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

టపాసుల నిల్వలపై జాగ్రత్తలు పాటించాలి



ఖలీల్‌వాడి: టపాసు దుకాణాల నిర్వాహకులు టపాసుల నిల్వలపై, విక్రయాలు నిర్వహించేటపుడు జాగ్రత్తలు పాటించాలని నిజామాబాద్ ఏసీపీ రాజావెంకటరెడ్డి సూచించారు. సబ్ డివిజన్ పరిధిలోని క్రాకర్స్ యజమానులకు శనివారం ఆయన నగరంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. లైసెన్స్ తీసుకోకుండా క్రాకర్స్ అమ్మినట్లయితే వారి పై చట్టప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు తప్పక పాటించాలన్నారు. సీఐలు, ఎస్సై మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



నిజామాబాద్‌అర్బన్: నగరంలో శనివారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న చెకుముకి సైన్స్ సంబురాల వాల్‌పోస్టర్లను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆవిష్కరణ చేశారు. బాలబాలికల విద్యా, విజ్ఞానం, వికాసం కోసం నవంబర్ 7న పాఠశాల స్థాయి, నవంబర్ 21న మండల స్థాయి, 28న జిల్లా స్థాయిల్లో సైన్స్ టెస్ట్ (సంబురాలు) నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలు డిసెంబర్ 14,15,16 తేదీల్లో ఆదిలాబాద్ జిల్లాలో నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా ప్రతినిధులు పులి జైపాల్, బాస రాజేశ్వర్, శ్రీహరి ఆచార్య, తుక్కడి నారాయణ, కోశాధికారి పందరి, న్యాయవాదులు శంకర్, కృష్ణ పాల్గొన్నారు.

బల్దియా ఉద్యోగుల స్టడీ టూర్



సిద్దిపేటలో స్థానిక అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ మకరందు

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది శనివారం స్టడీ టూర్‌లో భాగంగా సిద్దిపేటకు తరలివెళ్లారు. మున్సిపల్ కమిషనర్ మంద మకరందుతో కలసి డిప్యూటీ కమిషనర్ రాజేంద్రకుమార్, సానిటేషన్ సిబ్బంది టూర్‌కు వెళ్లారు. సిద్దిపేటలో వారు కంపోస్టు ఎరువుల తయారీని పరిశీలించారు. అలాగే తడి, పొడి చెత్త సేకరించే విధానాన్ని పరిశీలించారు.

గ్రంథాలయాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం



జిల్లాకేంద్రంలోని గ్రంథాలయంలో పుస్తకాలను పరిశీలిస్తున్న చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి



అంతిరెడ్డి రాజిరెడ్డిని సన్మానిస్తున్న లైబ్రేరియన్లు



రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో..

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలోని అన్ని గ్రంథాలయాల్లో పాఠకులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని, అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉంచుతామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పలు గ్రంథాలయాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పాఠకులతో మాట్లాడి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాత జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో కొందరు అభ్యర్థులు ప్రిపరేషన్ అవుతున్నారు. అక్కడ అపరిశుభ్రత వాతావరణం పిచ్చిమొక్కలు పెరగడం ఉండడంతో అభ్యర్థుల అభ్యర్థన మేరకు తక్షణమే చైర్మన్ పరిసరాలను శుభ్రం చేయించారు. గ్రంథాలయం అధికారులు తారకం తదితరులు ఉన్నారు.

జిల్లా గ్రంథాలయ చైర్మన్‌కు సన్మానం

నిజామాబాద్ సిటీ: జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డిని శనివారం ఆయన నివాసంలో పలువురు లైబ్రేరియన్లు కలిసి, సన్మానించారు. గ్రంథాలయాల్లోని సమస్యలను వివరించారు. బాసర ఐఐఐటీ ఇన్‌చార్జి లైబ్రేరియన్ అరుణజ్యోతి, జీజీ కళాశాల మాజీ లైబ్రేరియన్ వీర ప్రసాద్, జలజ, రామకిషోర్ తదితరులు ఉన్నారు.

నిజామాబాద్‌నాగారం: తెలంగాణ ఆల్ పెన్షనర్స్–రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డికి సన్మానించారు. నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టినందుకు ఆయనని అభినందించారు. అసోసియేషన్ అధ్యక్షుడు రామ్మోహన్‌రావు, ఉపాధ్యక్షులు ప్రసాద్ రావు, లావు వీరయ్య, కోశాధికారి ఈవీఎల్ నారాయణ, శిర్ప హనుమాండ్లు, లక్ష్మీనారాయణ, రాధాకృష్ణ, సుధాకర్‌రావు తదితరులు ఉన్నారు.

ఆలయ భూముల పరిశీలన



భైంసాలోని బడారాంమందిర్ భూములను పరిశీలిస్తున్న దేవాదాయశాఖ అధికారులు

నిజామాబాద్ రూరల్: నగరంలోని బడా రాంమందిర్‌కు చెందిన మాన్యం భూములను దేవాదాయశాఖ సహాయ కమిషనర్ విజయరామారావు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా భైంసాలోని బోల్స, సిరాల, మాంజ్రీ గ్రామాల్లోని సర్వే నెంబర్లు 13, 98, 16లో గల 31 ఎకరాల మాన్యం భూమిని పరిశీలించారు. అనంతరం కౌలుదారులతో ఆయన మాట్లాడారు. ఖరీఫ్ ముగిసినందున కౌలు చెల్లించాలన్నారు. గతంలో కంటే కూడ హెచ్చింపు చేసి చెల్లించాలని తెలిపారు. ఈ విషయంపై స్థానిక తహసీల్దార్‌తో మాట్లాడారు. అలాగేలో సర్వే నంబర్ 599, 600లోగల జండాబాలాజీ ఆలయ భూముల గురించి ఆయన ఆర్డీవోను కలిసి చర్చించారు. అధికారులు వేణు, ప్రశాంత్‌కుమార్, సతీష్ ఉన్నారు.

కళాకారులకు భగవద్గీత అందజేత

మోపాల్: నగరశివారులోని బోర్గాం(పి) 5వ డివిజన్‌లో 40 మంది కళాకారులకు శనివారం అంతర్జాతీయ కళాకారుల దినోత్సవం సందర్భంగా కళాభారతి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో భగవద్గీతలను అందజేశారు. బీజేపీ నాయకులు దండు శ్రీకాంత్ ఆధ్వర్యంలో కళాకారులను సన్మానించారు. సంగీత గురువు సాప గంగన్న, కళాభారతి సభ్యులు సోమర్తి జలంధర్, దండు శ్రీకాంత్, రచ్చ ఆనంద్, తోఫారం రవీందర్, చిలుక గంగసాయిలు, దార్‌సింగ్, తలారి నారాయణ, కొట్టూరి గంగాప్రసాద్, శివయ్య పాల్గొన్నారు.

శబరిమలకు పాదయాత్ర



నిజామాబాద్ రూరల్: జిల్లా కేంద్రానికి చెందిన పలువురు అయ్యప్ప మాలధారులు శనివారం నగరంలోని అయ్యప్ప ఆలయం నుంచి శబరిమలకు పాదయాత్రగా బయలుదేరారు. యాత్రను అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ జెండా ఊపి ప్రారంభించారు. ఈ పాదయాత్ర 41 రోజుల పాటు సాగుతుందని రాజ్‌కుమార్‌స్వామి తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే అయ్యప్ప మాలధారులతో ఆలయంలో పూజలు చేశారు. నందుగురుస్వామి, విక్రమ్‌గౌడ్, మహేశ్, రాజేందర్ పాల్గొన్నారు.

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	200
		లైవ్	140
స్కిన్‌లెస్	240	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	81,900	వెండి(కిలో)	1,03,000
22 క్యారెట్స్	75,572	– నిజామాబాద్ బిజినెస్	

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	24	40	గాజరుగడ్డ	50	80
బెండకాయ	40	60	పచ్చిమిర్చి	40	60
బీరకాయ	60	80	దోసకాయ	30	50
దొండకాయ	40	80	ఆలుగడ్డ	35	60
బీర్నిసుకాయ	80	120	గోబిగడ్డ	25	50
కాకరకాయ	40	80	గోబిపువ్వు	50	90
వంకాయ	50	75	బీట్‌రూట్	50	90
పాలకూర	30	50	కరివేపాకు	40	70
మెంతికూర	60	80	చామగడ్డ	40	70
కొత్తిమీర	50	80	గోరుచిక్కుడు	50	80
పుదీనా	60	90	చిక్కుడుకాయ	50	80
క్యాప్సికం	60	90			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	లగ్గం(తెలుగు)-10.40,4.40 విశ్వం(తెలుగు)-1.30 7.30 వేట్టయన్(తెలుగు)-10.40
స్క్రీన్-2	వెనమ్-ది (తెలుగు-3డీ)-11.00, 1.45,7.35 వెనమ్-ది(ఇంగ్లీష్-3డీ)-4.35, 10.35
స్క్రీన్-3	వేట్టయన్ - 1.35 పొట్టేల్(తెలుగు)-4.40,10.40 దేవర-పార్ట్-1(తెలుగు)-7.35

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	వెనమ్ ది లాస్ట్ డ్యాన్స్ (3డీ తెలుగు)-11.25,2.00 వెనమ్ ది లాస్ట్ డ్యాన్స్ (3డీ ఇంగ్లీష్)-4.35,7.10,9.45
స్క్రీన్-2	నరుడి బ్రతుకు నటన (తెలుగు)-1.05 దేవర(పార్ట్-1)- తెలుగు-4.00 జనక అయితే గనక(తెలుగు)-7.35 విశ్వం(తెలుగు)-10.35
స్క్రీన్-3	జనక అయితే గనక (తెలుగు)- 1.20 7.30 పొట్టేల్(తెలుగు)-4.20 10.25
స్క్రీన్ -4	ఎంత పనిచేస్తావ్ చంటి -11.00 లగ్గం(తెలుగు)-1.55 7.50 సముద్రుడు(తెలుగు)-4.45 వేట్టయన్(తెలుగు)-10.40
లలితామహల్	దేవర పార్ట్-1(తెలుగు)
దేవి	పొట్టేల్ (తెలుగు)
నటరాజ్	విశ్వం (తెలుగు)
విజయ్	వెనమ్ (తెలుగు)

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 20764
90102 86628 (నిజామాబాద్)
94920 10949 (బోధన్, బాన్సువాడ)
95055 08389 (ఆర్మూర్)
Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఆర్మూర్ సి. ప్రభాకర్ ACO : 9010585333
నిజామాబాద్ అర్బన్ & రూరల్ జి. రాంనాథ్ : 9849180084
బాల్కొండ ప్రదీప్ : 7893150102
బోధన్ ఎ.శివ : 9848956776
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899